యథేచ్ఛగా బీటీ రోడ్డుపై తవ్వకాలు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదార్లు
- అడ్డుకట్ట వేయడంలో నిర్లక్ష్యం



ల్యాబర్తి దారిలో బీటీ రోడ్డుపై తవ్విన కాల్వ

వర్ధన్నపేట : మండలంలోని డీసీ తండా నుంచి ల్యాబర్తి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డుపై కొందరు యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టారు. దీంతో రోడ్డు ధ్వంసం కావడంతోపాటు వాహనదార్లు ప్రమాదాల బారిన పడుతున్న దుస్థితి నెలకొంది. అయినా పోలీసు, ఇతర సంబంధిత శాఖల అధికారులు అడ్డుకట్ట వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలోని డీసీ తండా నుంచి ల్యాబర్తికి వెళ్లే బీటీ రోడ్డుపై పలు చోట్ల కొందరు రైతులు పంట పొలాలకు బోరు బావుల ద్వారా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాలకు నీరందించేందుకు కాల్వలు తవ్వారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో బీటీ రోడ్లు ధ్వంసం అయ్యాయి. రోడ్డుపైనే కాల్వలు తీసి పంట పొలాలకు నీరు పారిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో తవ్విన కాల్వల్లో వాహనాలు పడిపోయి ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు గాయాల పాలయ్యారు. నిరంతరం రోడ్డుపై నీరు పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న అపవాదు ఉంది. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్లపై తవ్వకాలు చేపట్టిన రైతులకు కౌన్సిలింగ్ చేయాలని, సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నాం

రోడ్లపై తవ్వకాలు చేపట్టడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లు సైతం ధ్వంసం అవుతున్నాయి. పంట పొలాలకు నీరు అందించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. డీసీ తండా రోడ్డు ధ్వంసం కావడంతో ప్రమాదం పొంచి ఉంది. వెంటనే అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

- ఈరెల్లి శ్రీనివాస్, వర్ధన్నపేట

కాల్వలు తవ్వడం తగదు

డీసీ తండా నుంచి ల్యాబర్తి వరకు పలు చోట్ల కొందరు రైతులు కాల్వలు తవ్విన విషయం మా దృష్టికి వచ్చింది. ఈ రోడ్డు పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే ముందు అవసరం ఉన్న రైతులు పైపులు వేసుకునేందుకు సహకరిస్తాం. రోడ్లపై కాల్వలు తవ్వితే మాత్రం చట్టపరమైన చర్యలు తప్పవు.

- బాబురావు, డీఈ, పంచాయతీరాజ్ శాఖ

క్లుప్తంగా

'మట్టి గ్లాసులో టీ' అదుర్స్



నర్సంపేట : మట్టి గ్లాసులో టీ విక్రయం అదిరిపోతోంది. చిరువ్యాపారమైనా వినూత్నంగా రాణించే దిశగా పట్టణానికి చెందిన లహరి శివప్రసాద్ దంపతులు స్థానిక పాకాల్ సెంటర్‌లో స్టాల్ ఏర్పాటు చేసి మట్టి గ్లాసులో టీ అందిస్తూ టీ తాగే వారిని ఆకట్టుకున్నారు. టీ ప్రియులు సైతం మట్టి గ్లాసులో టీ ఆస్వాదిస్తుండడంతో వ్యాపారం వృద్ధి చెందుతుండడం గమనార్హం. ప్లాస్టిక్ నిర్మూలనకు పాటుపడుతూనే టీ తాగే వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ స్వయం ఉపాధి పొందుతున్న తమకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలని లహరి శివప్రసాద్ దంపతులు కోరుతున్నారు.

దుప్పట్ల పంపిణీ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరంలోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ, ఏబీఎస్ఎఫ్, స్వేరో సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సమకూర్చిన దుప్పట్లను టౌన్ సీఐ రమణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగా దిశగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని చెప్పారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. చలి తీవ్రత నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేలా దుప్పట్లు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ఇషాక్ అలీ, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, స్వేరోస్ మాజీ అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

'యుద్ధభేరి' సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



సాక్షి నెట్‌వర్క్ : హనుమకొండలో నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జిల్లాలోని దుగ్గొండి, సంగెం, నెక్కొండ, పర్వతగిరి, రాయపర్తి మండలాల్లో పలు సంఘాల నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. దుగ్గొండి మండలంలో గౌడజన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్, నెక్కొండతోపాటు పర్వతగిరి మండలంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతం, సంగెంలో బీసీ నాయకుడు గిరబోయిన రాజయ్య, రాయపర్తిలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు ముద్రబోయిన వెంకటేశ్వర్లు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

దుర్గమ్మ పండుగ ఉత్సవ పత్రికల..



రాయపర్తి : మండలంలోని మైలారంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న దుర్గమ్మ పండుగ ఉత్సవ పత్రికలను గ్రామస్తులతో కలిసి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సర్పంచ్ బోయిని కుమార్, ఉపాధ్యక్షుడు ఈర్ల మల్లయ్య, సంఘం పెద్ద బోయిని కొంరయ్య, కార్యదర్శి బోయిని చిన్న కుమార్, కనుకుంట్ల సోమయ్య, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు దేవేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సంపత్, కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గీత పని వారల సంఘం క్యాలెండర్..

పర్వతగిరి : మండల కేంద్రంలో గీత పనివారల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బైరి తిరుపతి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గీత పరివారల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దొనికల సదానందం, శ్రీనివాస్, గోపా జిల్లా బాధ్యులు బొమ్మెర కుమారస్వామి, దొనికల రవి, తీగల వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ జయంతి

నల్లబెల్లి/సంగెం : మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జననాట్య మండలి వ్యవస్థాపకుడు, ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు తెలంగాణ ఫోరం జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డివిజన్ ఉపాధ్యక్షుడు గూబ రాజు పండ్లు పంపిణీ చేశారు. సంగెంలో కళాకారులు మెట్టుపల్లి రమేశ్, బొమ్మెర రవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- ఏసీపీలు కిరణ్, తిరుపతి, ఎంవీఐ శోభన్



నెక్కొండ : మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నెక్కొండ : రోడ్డు ప్రమాదాలను నివారించాలని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, వరంగల్ ఎంవీఐ శోభన్‌బాబు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పరమేశ్వర్ గార్డెన్స్‌లో సదస్సు నిర్వహించగా విద్యోదయ గురుకుల స్కూల్ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ ఎంవీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్‌కుమార్, ఎంవీఐ శోభన్‌బాబు మాట్లాడారు. వాహనదార్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని చెప్పారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతా నియమాలు తెలుసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతుండగా బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణను బాధ్యతగా భావించాలని కార్యక్రమాల్లో సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్, ఏఎంవీఐలు ఉదయ్‌కుమార్, నరేందర్, స్కూల్ కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి, డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని తీగరాజుపల్లి నుంచి సంగెం వరకు పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో మామునూర్ ఏసీపీ తిరుపతి మాట్లాడారు. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌గోపాల్, ఎస్సై నరేశ్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో లబ్ధి కోసమే సభలు



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ఏ ఒక్క పథకం కూడా అధికారికంగా ప్రకటించలేదని, అప్పటికప్పుడు ప్రొసీడింగ్ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 179 గ్రామ పంచాయతీలుండగా కేవలం 6 జీపీల్లో మాత్రమే లబ్ధిదారులను ప్రకటించడం ఇతర పంచాయతీల ప్రజలను అవమానించడమేనని తెలిపారు. గతంలో చేపట్టిన 70 శాతం పనులకు మళ్లీ కొత్తగా రూ.10 కోట్ల నిధులు ఎలా మంజూరు చేసి ప్రొసీడింగ్ తెచ్చారన్నారు. యాంత్రీకరణ కోసం తెచ్చిన రూ.60 కోట్ల నిధులను ల్యాప్స్ చేసి మళ్లీ అవే మార్గదర్శకాలతో టెండర్లు పిలిచారంటూ రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాలను ఎండగట్టారు. సమావేశంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్, బండి రమేశ్, పెండెం వెంకటేశ్వర్లు, గంప రాజేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు పెండ్యాల యాదగిరి, పట్టణ యూత్ ఉపాధ్యక్షుడు పైసా ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సాదు రమేశ్‌ను ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ శ్రీధర్ హాజరై మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉపాధ్యాయుడిగా రమేశ్ దశాబ్దాలపాటు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. తొలుత రమేశ్ దంపతులకు ఎంఈఓ, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగు అనిల్, ట్యూల బ్యాట్రిస్, మనుజేందర్‌రెడ్డి, రాజకుమారి, అనిత, రహీం, తాళ్లపెల్లి శ్రీనివాస్, గుడికందుల సురేశ్, గాయాల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మైసంపల్లి స్కూల్‌లో..



దుగ్గొండి : మండలంలోని మైసంపల్లి ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ టీచర్‌గా పని చేసి నూనావత్ సమ్మును ఉద్యోగ విరమణ చేసిన సతీసమేతంగా ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సురేందర్ మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా సమ్ము విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని అభినందించారు. అనంతరం జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సయ్య, వెంకటేశ్వర్లు, స్వరూపరాణి, ఇంద్రసేనారెడ్డి, నిజాముద్దీన్, కైలాసం, గీతాబాయి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజ సమగ్రాభివృద్ధి



రాయపర్తి : విద్యార్థులతో హెచ్ఎం, తదితరులు

నెక్కొండ : సైన్స్‌తోనే సమాజ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎంఈఓ రత్నమాల తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ కష్టతరమన్న భావన నుంచి విద్యార్థులు బయటపడి ఇష్టమైన సబ్జెక్ట్‌గా ఎంచుకుంటే బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని, శాస్త్రీయ వైఖరులను వెలికి తీసేలా టాలెంట్ టెస్ట్‌లు దోహదపడతాయని తెలిపారు. అనంతరం విజేతలకు హెచ్ఎం రంగా రావు బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన సిరిచందన్, లక్ష్మీప్రసన్న, అశ్వితలను అభినందించారు. సమావేశంలో పరీక్ష ఇన్‌చార్జ్‌లు సురేందర్‌రెడ్డి, సురేశ్, గైడ్ టీచర్లు శ్రవణ్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, పూర్ణిమ, సరిత, లక్ష్మి, రమేశ్, వినయ్‌కుమార్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో నిర్వహించిన పరీక్షను ఎంఈఓ సరళ, ఎఫ్‌పీఎస్‌టీ ఫోరం మండల ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడంలో టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని చెప్పారు. పరీక్షలో ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులు అకాష్ ప్రథమ, రెడ్డబోయిన అమని ద్వితీయ, క్లెపు శ్రీజ తృతీయ స్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులతోపాటు గైడ్ టీచర్ పిన్నింటి బాలాజీరావును ఎంఈఓ సరళ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, రజిత, బండారి భిక్షపతి, సుభాశ్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పరీక్ష నిర్వహించగా కొండూరు స్కూల్ విద్యార్థులు సాయివర్ధన్, వర్షిత్‌రెడ్డి, సాయిచరణ్ ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం గారె కృష్ణమూర్తి అభినందించి మాట్లాడారు. కార్యక్రమంలో కొండూరు స్కూల్ హెచ్ఎం పద్మలత, కోఆర్డినేటర్ గాదె ప్రవీణ్‌రెడ్డి, కటకం రఘు, మిటుకుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నర్సంపేట : పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పవిత్ర నదీజల కళశాలతో, అష్టోత్తర ఘట గోక్షీర, పంచామృతాలతో అభిషేకం చేశారు. అమ్మవారిని అలంకరించి హోమం నిర్వహించారు. సాయంత్రం పుష్పార్చన, లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంచూరి కృష్ణమూర్తి, సభ్యులు నాగమల్ల కృష్ణమూర్తి, పిన్నా రామనాథం, శింగిరికొండ మాధవశంకర్, తోట బాలభాస్కర్, వంగేటి గోవర్ధన్, బ్రాహ్మణపల్లి సుమన్, గర్రెపల్లి శ్రీను, బాదం విజయ్, మాదారపు చంద్రశేఖర్, మాదార రవీంద్ర, పబ్బ శ్రీను, దేవునూరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటస్వామి

పర్వతగిరి : వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 10 రోజుల వరకు ప్రతిరోజూ 10 ఆవాసాలు చొప్పున సందర్శించాలని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న ఇతర సమస్యలను సైతం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ (ఇంట్రా) ఏఈ అరుణ్‌కుమార్, గ్రిడ్ ఏఈ హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సంగెం : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ కందకట్ల నరహరిని అతడి తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు శుక్రవారం పరామర్శించారు. తొలుత లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జెండా రాజేశ్, మోర్తాల చందర్‌రావు, కొడగాని నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఊకల్‌లో..

రాయపర్తి : మండలంలోని ఊకల్‌కు చెందిన గుంతల సోమమల్లు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వల్లపు కుమార్ శుక్రవారం పరామర్శించారు. తొలుత సోమమల్లు చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల ప్రభాకర్, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నీలయ్య, ఉల్లెంగుల నర్సయ్య, గోవర్ధన్‌రెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, చిర్ర మల్లయ్య, పీరని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట రూరల్ : మండలంలోని మాదన్నపేటకు చెందిన ఎంసీపీఐ(యూ) నాయకుడు గాదెగోని రవి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కేంద్ర కమిటీ సభ్యుడు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర నాయకుడు కన్నం వెంకన్న పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారస్వామి, రమేశ్, వెంకన్న మాట్లాడారు. బాబు నిత్యం ప్రజాపోరాటాల్లో ముందుండే వారని చెప్పారు. బాబు మృతి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంగాల రాగసుధ, కనకం సంధ్య, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, తదితరులున్నారు.

ఎంపీటీసీ స్థానాలు పెంచాలి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన గురిజాల, ఇటుకాలపల్లిల్లో జనాభా దామాషా ప్రకారం ఎంపీటీసీ స్థానాలను పెంచాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సత్యనారాయణ మాట్లాడారు. నర్సంపేట మండలంలో అత్యధిక జనాభా గురిజాలలో ఉన్నప్పటికీ ఒక ఎంపీటీసీ స్థానమే ఉందని, ఇటుకాలపల్లిలో జనాభా దామాషా ప్రకారం మరో ఎంపీటీసీ స్థానాన్ని పెంచాల్సి ఉందని వివరించారు.

'ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు కోటా ఇవ్వాలి'



దుగ్గొండి : ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు 5 శాతం కోటా ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎంపీడీఓ అరుంధతి, డిప్యూటీ తహసీల్దార్ ఉమాదేవిలను శుక్రవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ప్రణయ్‌దీప్ మాట్లాడారు. జీఓ నంబర్ 33 ప్రకారం దివ్యాంగులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మామునూరి శ్రీధర్, కొలగాని రవి, గంగారపు రవీందర్, పర్లపెల్లి యుగేంధర్, గోర్కటి రాజ్‌కుమార్, నల్లబెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మైక్ సెట్ బహూకరణ



వర్ధన్నపేట : స్థానిక బాలాంజనేయ స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన హనుమాన్ సేవా సమితి సభ్యులు శుక్రవారం మినీ మైక్ సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడారు. ఆలయంలోని పాత మైక్ పాడైపోవడంతో మినీ మైక్ సెట్ కొనుగోలు చేసి పూజారి కలకోట శ్రవణ్ కుమారాచార్యులకు అందజేశామన్నారు. దాతల సహకారంతో ఆలయానికి అవసరమైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు, ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆరెల్లి నాగార్జున, పూజారి రాజు, ఆకుల మనోజ్, వడ్లకొండ మణిదీప్, చెన్న శ్రీకాంత్, గోగు చంద్రశేఖర్, వల్లల రంజిత్, డాక్టర్ కృష్ణ, ఆవుల ప్రవీణ్, మెరుగు హరీశ్, రాజేశ్, రాకేశ్, జగన్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి ఓర్వలేకే ఆరోపణలు'

నర్సంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి కిరణ్ అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డ్రామాలు ఆడుతోందన్న సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని చెప్పారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

వర్ధన్నపేట : ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని ఇల్లంద సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. వర్ధన్నపేట నుంచి వరంగల్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఇల్లంద సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా కుక్క అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించబోయిన క్రమంలో ఆటో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయలు కాగా ఆటో ధ్వంసం అయ్యింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

'సహకార-2'తో డిపాజిట్లపై అధిక వడ్డీ

- డీసీసీబీ డైరెక్టర్ మురళీధర్‌రావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, తదితరులు

నల్లబెల్లి : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో కొత్తగా అమల్లోకి వచ్చిన సహకార మిత్ర-2 పథకంతో డిపాజిట్లపై అధిక వడ్డీ అందుతుందని డైరెక్టర్ చెట్టుపల్లి మురళీధర్‌రావు తెలిపారు. స్థానిక బ్యాంకు శాఖ కార్యాలయంలో ఆ పథకం కరపత్రాన్ని ఉద్యోగులతో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పథకం కింద బ్యాంకులో రైతులు పొదుపు చేసే డబ్బుకు 8.50 శాతం వడ్డీ లభిస్తుందని చెప్పారు. తెలంగాణ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నెని రవీందర్‌రావు చొరవతో పథకానికి రూపకల్పన జరిగిందని తెలిపారు. ఈ పథకం కింద బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేస్తే ప్రతినెలా రూ.704 చొప్పున వడ్డీ పొందవచ్చని వివరించారు. పథకాన్ని, ఇతర బ్యాంకు సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ యాకూబ్ పాషా, సొసైటీ సెక్రటరీ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

'శవ రాజకీయాలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

సంగెం : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శవ రాజకీయాలకు పాల్పడడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పోచమ్మతండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనను రాజకీయ లబ్ధికి ఉపయోగించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి తొలి ఏడాదే తిరుపతికి రూ.1.73 లక్షల రుణమాఫీ చేశామని చెప్పారు. శవ రాజకీయాలను ప్రజలే తిప్పికొడతారని తెలిపారు. సమావేశంలో ఊకల్ సొసైటీ చైర్మన్ రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు, నాయకులు మెట్టుపల్లి రమేశ్, రమేశ్ నాయక్, ఆగపాటి రాజు, కేశవులు, కిశోర్, సాంబయ్య, కవిత, రవి, సారంగం తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



డీటీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : పట్టణంలో వడ్డెర కాలనీని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింత సిద్ధూ, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి (డీటీడీఓ) సౌజన్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సందీప్, సిద్ధూ, రవి మాట్లాడారు. స్కూల్‌కు ప్రహరీ లేకపోవడంతో కొందరు పాఠశాల స్థలాన్ని ఆక్రమిస్తున్నారని తెలిపారు. స్కూల్ గ్రౌండ్‌లోనే కిరాణా డబ్బా ఏర్పాటు చేస్తున్నారని, ఇసుక నిల్వ చేసుకుంటున్నారని, ట్రాక్టర్లు పార్క్ చేస్తున్నారని చెప్పారు. పందులు సైతం వస్తూ ఇబ్బంది కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రహరీ నిర్మిస్తే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారి కోసం టాయిలెట్లు సైతం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, రమేశ్, రాజేశ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.